www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 19 జనవరి 2025
5
ఏలూరు



సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

కారాగారాన్ని పరిశీలించిన జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

ప్రజాశక్తి - చింతలపూడి

కారాగార సిబ్బంది బాధ్యతగా పని చేయాలని చింతలపూడి మండల న్యాయ సేవాధికార కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ న్యాయమూర్తి సిహెచ్.మధుబాబు చెప్పారు. చింతలపూడి కారాగారాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిందితుల కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్నవారికి అందించే వైద్య సదుపాయాలు తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాలు, జైలు నిందితులకు అందించిన సహాయంపై ఆరా తీశారు. అందరూ బాధ్యతగా పని చేయాలని చెప్పారు. వంటశాల స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కారాగారం పర్యవేక్షణ అధికారి కృపానందం, జైలు సిబ్బంది, ప్యానల్ లాయర్ కె.అప్పయ్య, పిఎల్‌వి పి కుమార్ పాల్గొన్నారు.



మళ్లీ తెరపైకి..

వట్లూరు భూములు..!

'పెదపాడు మండలం వట్లూరులో 350 ఎకరాల భూములు ఉన్నాయి. ఆ భూములను పరిశ్రమల ఏర్పాటుకు ఉపయోగించుకుంటే బాగుంటుంది. ఈ నెల 16వ తేదీన జరిగిన డిఆర్‌సి సమావేశంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ మాట్లాడిన మాట.'

'ఆ భూముల వ్యవహారం కోర్టులో ఉంది. గతంలో ఆ భూములను ఎపిఐఐసికి ప్రభుత్వం కేటాయించిందని అధికారులు సమాధానం.'

'వట్లూరు భూములకు సంబంధించి రైతులకు పరిహారం ఇవ్వలేదు. ఆ భూముల్లో ఏదైనా చేయాలంటే కోర్టు కేసులు పరిష్కరించడంతోపాటు, రైతులకు పరిహారం ఇవ్వాలి. అక్కడ ఏదైనా పనులు మొదలు పెడితే రైతులు మళ్లీ ముందుకొచ్చే అవకాశం ఉంది.' : దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

అప్పట్లో రైతుల నుంచి 340 ఎకరాలు స్వాధీనం

ఇప్పటికీ రైతులకు చిల్లిగవ్వ పరిహారం ఇవ్వని పరిస్థితి

2016లో అడ్డగోలుగా భూములు లాక్కోవడంతో ఎన్నో కుటుంబాలు ఛిద్రం

ఆ భూములను పరిశ్రమల ఏర్పాటుకు ఉపయోగించాలంటున్న ప్రజా ప్రతినిధులు

కోర్టుకేసులు, ఇతర అంశాలపై నివేదిక ఇవ్వాలన్న ఇన్‌ఛార్జి మంత్రి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వట్లూరు పెదచెరువుకు చెందిన భూముల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఏలూరు జిల్లాలో పెద్ద ఎత్తున ఇండస్ట్రీయల్ పార్క్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అందుకు సంబంధించి ప్రభుత్వ భూములను గుర్తించి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటుకు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా అధికారులు 1595.70 ఎకరాల భూమి మాత్రమే అందుబాటులో ఉందని తేల్చారు. ఆ భూములు కూడా ప్రతి మండలంలో కొద్ది మొత్తంలో మాత్రమే ఉన్నాయని అధికారులు తేల్చారు. ఈ నెల 16వ తేదీన కలెక్టర్ ప్రాంగణంలోని గోదావరి సమావేశ మందిరంలో డిఆర్‌సి (జిల్లా సమీక్షా సమావేశం) జరిగింది. ఈ సందర్భంగా ఇండస్ట్రీయల్ పార్క్‌ల ఏర్పాటుపై చర్చలో భాగంగా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ వట్లూరు పెదచెరువు భూముల ప్రస్తావన లేవనెత్తారు. అక్కడ ఉన్న 350 ఎకరాలను పరిశ్రమల ఏర్పాటుకు ఉపయోగించుకుంటే బాగుంటుందని తెలిపారు. ఆ భూముల వ్యవహారం కోర్టులో ఉందని అధికారులు తెలిపారు. అంతే తప్ప 2016లో ఆ భూములకు సంబంధించి ఏం జరిగింది. ఎందుకు కోర్టులో కేసు నమోదైందో అధికారులు పూర్తిగా వివరించలేదు. చెరువు భూములను ఎపిఐఐసికి ఏ విధంగా కేటాయించారన్న ప్రజా ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానం లేకుండా పోయింది. అప్పట్లో బలవంతంగా రైతుల నుంచి వట్లూరు భూములను లాక్కోవడంతో ఎంతో మంది రైతులు రోడ్డున పడ్డ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా రైతులకు పరిహారం అందించి న్యాయం చేస్తారా అన్న చర్చ అక్కడి రైతుల్లో నెలకొంది.

వట్లూరు భూముల కథ ఇది..!

టిడిపి ప్రభుత్వ హయాంలో 2016లో వట్లూరు పెదచెరువు భూముల్లో వెమ్ టెక్నాలజీ (విమాన విడిభాగాల తయారీ) పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పెదపాడు మండలం వట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 495, 496, 497లోనూ పెదవేగి మండలంలోని సర్వే నంబర్ 210 - 29 పరిధిలో దాదాపు 340 ఎకరాలను వెమ్ టెక్నాలజీ సంస్థకు ఎపిఐఐసి ద్వారా కేటాయించారు. ఈ భూములను దాదాపుగా 300 మంది సన్న, చిన్నకారు రైతులు దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్నారు. రికార్డుల ప్రకారం ఇవి వట్లూరు పెదచెరువు భూములుగా ఉన్నాయి. చట్ట ప్రకారం చెరువు భూములైనప్పటికీ రైతుల స్వాధీనంలో ఉన్నప్పుడు పరిహారం చెల్లించి తీసుకోవాలి. ఇక్కడ మాత్రం అటువంటి ప్రక్రియ జరగలేదు. భూముల సేకరించే సమయంలో రైతులు దీనిపై పెద్ద ఎత్తున పోరాటం చేశారు. దీంతో ఎకరాకు రూ.2.50 లక్షల పరిహారం ఇచ్చేలా నిర్ణయించారు. ఇప్పటివరకూ రైతులకు చిల్లిగవ్వ పరిహారం అందలేదు. భూములు బలవంతంగా లాక్కోవడంతో ఎన్నో కుటుంబాలు ఆర్థిక ఆసరాను కోల్పోయి రోడ్డున పడ్డాయి. 2019 ఎన్నికల్లో టిడిపి ఓటమిపాలైంది. అధికారంలోకి వచ్చిన వైసిపి రైతుల గురించి పట్టించుకోలేదు. పరిశ్రమ ఏర్పాటు జరగలేదు. 2022లో వెమ్ టెక్నాలజీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుని ఆ భూములను ఎపిఐఐసి స్వాధీనం చేసుకుంది. దీనిపై కోర్టులో కేసు సైతం ఉంది. ఈ భూములకు సంబంధించి పూర్తిస్థాయి వివరాలు ఇవ్వాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ డిఆర్‌సి సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఇప్పటికైనా రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు. ప్రభుత్వం ఏ విధంగా ముందుకు సాగుతుందో చూడాల్సి ఉంది.



నూజివీడు టౌన్ : మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

స్వచ్ఛతపై అవగాహన అవసరం

స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో మంత్రి పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు. శనివారం మండలం తుక్కులూరులో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో మంత్రి పార్థసారధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుక్కులూరు కూడలిలో మానవహారంగా ఏర్పడి అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞను మంత్రి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత, శుభ్రత ప్రజల జీవన విధానం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ప్రతినెలా 3వ శనివారం క్రమం తప్పకుండా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనే మంచి ఆలోచన అందరిలో ప్రేరేపితం కావాలన్నారు. గత ప్రభుత్వం పారిశుధ్యంపై నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందన్నారు. ఆ చెత్తను నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుభ్రం చేయించి ప్రజలకు మంచి ఆరోగ్యకరమైన వాతావరణం కలిగించేందుకు నిర్మాణాత్మకమైన కార్యక్రమాలను చేపట్టారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచే తొమ్మండ్రు బుజ్జి, జెడ్పి సిఇఒ కె.సుబ్బారావు, డిఎల్ పిఒ ఎంపిఎల్ సుందరి, డిఎల్ డిఒ వెంకట్రావు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా నూజివీడులో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పర్యటించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. తొలుత రాజీవ్ సర్కిల్‌లో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం రోడ్డు రివైడర్‌పై మొక్కలు పెంచడంపై మున్సిపల్ అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. అనంతరం పట్టణంలో పలు రహదారులను సందర్శించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి మున్సిపల్ అధికారులకు ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన పారిశుధ్య పనులపై ఆదేశాలిచ్చారు. రాజీవ్ సర్కిల్ సమీపంలో రోడ్డుపై కొబ్బరి బొండాలు అమ్ముతూ పక్కనే వినియోగించిన బొండాలను పారేసి ఉండడాన్ని గుర్తించి ఆ వ్యాపారితో మాట్లాడి వాటిని రోజూ ఎక్కడ వేస్తారని ప్రశ్నించారు. దానిపై అతను సమాధానం ఇస్తూ సమీపంలోని మున్సిపల్ యార్డులో పడేస్తామని తెలిపారు. ఈ విషయంలో అత్యంత జాగ్రత్త తీసుకోవాలని ఇష్టానుసారం ప్లాస్టిక్, కొబ్బరి బొండాలు, తదితరాలను రోడ్లపై వేస్తే సంబంధిత వ్యక్తులపై జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చెత్త ఎక్కువగా ఎక్కడ పేరుకుపోయిందో ఆ ప్రాంతాలను గుర్తించి అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నూజివీడులో ప్లాస్టిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ రెడ్డి, తహశీల్దార్ సుబ్బారావు, అధికారులు ఉన్నారు.



ఏలూరు సిటీ : చీపురు పట్టి శుభ్రం చేస్తున్న ఎంఎల్ఎ, జెడ్‌పి ఛైర్ పర్సన్, కలెక్టర్

ఏలూరు సిటీ : ఏలూరు నగరంలో శనివారం ఉత్సాహపూరిత వాతావరణంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీపురు చేతపట్టి బస్టాండ్ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అనంతరం బస్టాండ్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. తరువాత అధికారులు, ప్రజలు, విద్యార్థులు, మహిళలతో కలిసి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, పర్యాటకులు, యాత్రికులు, పెట్టుబడిదారులను మరింత ఆహ్వానించే విధంగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపర్చడం, పిల్లలు, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. రాబోయే రోజులలో ఏలూరు జిల్లా సుందర, పరిశుభ్రత జిల్లాగా మార్చాల్సిన బాధ్యత అందరిదని తెలిపారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ పొడిచెత్త, తడిచెత్త వేరుచేసి ఇంటింటికీ వచ్చే పారిశుధ్య వాహనానికి అందించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మార్కెట్‌కు వెళ్లినప్పుడు తన సొంత బ్యాగులను ఉపయోగించుకొని ప్లాస్టిక్ నియంత్రణకు దోహదపడాలన్నారు. ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ ఏలూరు నగరంలో ఉద్యమంలా సాగి స్వచ్ఛ హేలాపురిగా నిలిపేందుకు ప్రతిఒక్కరూ భాగస్వామ్య కావాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, నగరపాలక కమిషనర్ ఎ.భానుప్రతాప్, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

డయాఫ్రం వాల్ పనులు వేగవంతం

ఇరిగేషన్ సిఇ నరసింహమూర్తి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో వేగవంతంగా డయాఫ్రం వాల్ పనులు చేపడతామని ఇరిగేషన్ సిఇ నరసింహమూర్తి తెలిపారు. శనివారం పోలవరం ప్రాజెక్టులో భూమి పూజ చేసి ఇరిగేషన్ అధికారులు పనులు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా సిఇ మాట్లాడుతూ అంతర్భాగంలో ప్లాస్టిక్ కాంక్రీట్ నదీ గర్భంలో మూడు వందల మీటర్ల మేర దిగువకు పంపడానికి సరిపడా రెండు సెట్లు సిద్ధం చేశామని తెలిపారు. ఏకకాలంలో 600 మీటర్ల పనులకు సరిపడా పైపులు సిద్ధం చేశామని, ఒకేసారి ఆరు ఫే నళ్లకు సరిపడా మెటీరియల్ ప్రాజెక్టు ప్రాంతంలో సిద్ధంగా ఉందని తెలిపారు. ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్లు దిగువ కాపర్ డ్యామ్‌కు సమీపంలో రామయ్యపేట ప్రాంతంలో రెండు చోట్ల రెండేసి చొప్పున నాలుగు ప్లాంట్లు ఇప్పటికే సిద్ధం చేశామని తెలిపారు. మరో ప్లాంటు నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంటులో డయాఫ్రంవాల్ నిర్మాణానికి ఉపయోగించే ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సింగ్ జరుగుతోందన్నారు. ఒక్కో ప్లాంటు ద్వారా 240 క్యూబిక్ మీటర్ల ప్లాస్టిక్ కాంక్రీట్ సరఫరా చేయబడుతోందని, నాలుగు ప్లాంట్ల ద్వారా 960 క్యూబిక్ మీటర్ల ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సింగ్ సిద్ధం చేశామని తెలిపారు. ట్రెంచ్ కట్టర్ జర్మనీ నుండి దిగుమతి చేసిన భారీ యంత్రం ద్వారా నదీ గర్భంలో రాతిపొరలు తగిలే వరకూ డయాఫ్రంవాల్ నిర్మాణపు ప్రాంతంలో నిర్మించిన కాంక్రీట్ గైడ్ వాల్ మధ్య తవ్వకాలు చేస్తామని చెప్పారు. ఈ యంత్రానికి అడుగు భాగాన ఉన్న భారీ కట్టర్లు భూమి అంతర్భాగంలోకి వేగవంతంగా చొచ్చుకు పోయేలా పని చేస్తాయని తెలిపారు. ట్రెంచ్ కట్టర్లకు అమర్చిన భారీ పైపుల ద్వారా బెంటోనేట్ పౌడరు కలిపిన జలాలను ట్రెంచ్ కట్టర్ పైపుల ద్వారా నదీ గర్భంలో ఉన్న మట్టి ఇసుక తవ్వకాల ప్రాంతంలో నిరంతర ప్రవాహం చేయడం వలన భూమి పొరల్లో ఇసుక ప్రాంతంలో తవ్వకాలు జరిపిన క్రమంలో ఇసుక పొరలు నలువైపుల నుండి తవ్వకాలలోకి జారకుండా బెంటోనైట్ గట్టిపరుస్తుందన్నారు. తద్వారా తవ్వకం పనులు సులభతరమవుతాయని చెప్పారు. డయాఫ్రంవాల్ నిర్మాణంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా తవ్వకాలు జరుగుతాయని, గరిష్ఠంగా 30 మీటర్ల నుండి కనిష్ఠంగా 40 మీటర్ల వరకూ ట్రెంచ్ కట్టర్ ద్వారా తవ్వకాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో క్వాలిటీ ఇఇ వెంకటేశ్వరరావు, బావర్ కంపెనీ ఇంజనీర్ హసన్, మెగా ఇంజినీరింగ్ కంపెనీ జిఎం.అంగర సతీష్ పాల్గొన్నారు.

కొనసాగిన పెన్షన్ల తనిఖీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలం వ్యాప్తంగా పక్షవాతం, తీవ్రమైన కండరాల బలహీనతలతో మంచానికి పరిమితమై రూ.15 వేలు పెన్షన్ తీసుకుంటున్న 23 మందిని గుర్తించారు. వారిని ఫిజికల్‌గా వెరిఫికేషన్ చేయడం కోసం ప్రత్యేక వైద్యాధికారులు టి.శ్రీనివాస సుబ్రహ్మణ్యన్, బి.రామనాయక్, వి.రవితేజ మెడికల్ బృందం శనివారం మండలంలో తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు మెడికల్ పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ల పునర్విచారణ చేపట్టారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితిని పరీక్షించారు. అనంతరం వారి వద్ద ఉన్న ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు దివ్య, మణికంఠ, వెలుగు సీసీలు, హెల్త్ సిబ్బంది, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలి

చెక్‌పోస్టులో మార్కెటింగ్ శాఖ ఆర్‌డిఒ లావణ్య తనిఖీలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సరిహద్దు గుండా ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్ట్ గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ శాఖ అధికారిణి పి.లావణ్య అన్నారు. జీలుగుమిల్లిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్ట్‌ను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టులో పలు దస్త్రాలను పరిశీలిం చారు. అనంతరం సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెటింగ్ సెస్ సంవత్సరానికి రూ.2.50 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా సిబ్బంది రూ.1.70 లక్షల వరకు సెస్ వసూలు చేసినట్లు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాలని సిబ్బందికి తెలిపారు. అదే విధంగా సిబ్బంది 24 గంటలపాటు విధుల్లో ఉండి చెక్ పోస్ట్ గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. పలు వాహనాలు దొంగ పర్మిట్‌లతో వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అట్టి వాహనాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ టీమ్ సభ్యులు ఎండి శ్రీనివాస్, వరలక్ష్మి పోలవరం శాఖ సెక్రటరీ మోహన్‌రావు, చింతలపూడి సెక్రటరీ మెహర్ బాషా, ఎఎంసి సిబ్బంది పాల్గొన్నారు.



దస్త్రాలను పరిశీలిస్తున్న లావణ్య

హెల్మెట్ తప్పక ధరించండి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ అధ్యక్షతన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో హెల్మెట్ ధారణ-ప్రమాదాల నివారణ అంశంపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ మాట్లాడుతూ రిట్ పిటీషన్ 116/2024 ఆర్డర్ ప్రకారం హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రమాదాలను నివారించడం పై అవగాహనా సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా న్యాయశాఖ ఉద్యోగస్తులకు, న్యాయవాదులకు, న్యాయవాద గుమస్తాలకు, స్థానిక ప్రజలకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించామని చెప్పారు. ఒక చిన్న తప్పిదం వల్ల జీవితాన్ని కోల్పోవటం గాని జీవితకాలం అంగవైకల్యాన్ని పొందడం కాని జరుగుతుందని, అశ్రద్ధ వహించకుండా వాహనాలు నడిపే వాహనదారులతో పాటు సహప్రయాణికులు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. కారులో ప్రయాణించేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ను ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం, ప్రభుత్వ న్యాయవాది బిజె.రెడ్డి, న్యాయవాదులు ఏలూరు వెంకటేశ్వరరావు, బి.సంగీతరావు, కోర్టు సిబ్బంది, న్యాయవాద గుమస్తాలు, కక్షిదారులు పాల్గొన్నారు.

పోలీస్ పెట్రోల్ బంక్ సిబ్బందికి బోనస్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు సిబ్బంది సంక్షేమమే కాకుండా పోలీసు సంక్షేమ సంఘం తరపున ఏర్పాటుచేసన వ్యాపార కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి సైతం ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ పెద్దపీట వేస్తున్నారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి ఛాంబర్‌లో శనివారం పోలీస్ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న సిబ్బందికి ఒక నెల వేతనాలను బోనస్‌గా అందించారు. అంతేకాకుండా పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న సిబ్బంది అందరికీ యూనిఫామ్ కూడా ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమ సంఘం తరపున ఏర్పాటుచేసిన పోలీస్ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. వారికి ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ముందస్తు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముందస్తు లింగ నిర్ధారణ చేయడం వల్ల కలిగే అనర్థాలపై, వాటికి తీసుకునే చట్టపరమైన చర్యలపై అవగాహన కల్పించారు. నేటి సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందని, ఈ పరిస్థితుల్లో కూడా కొన్ని పరీక్షా కేంద్రాల్లో స్వలాభం కోసం ఇటువంటి పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. వీటిని నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులతో పాటు సమాజంపై కూడా ఉందని తెలిపారు. సంబంధిత పరీక్షా కేంద్రాల్లో లింగ నిర్ధారణ చట్టంలో పొందుపరిచిన వివరాలను ప్రదర్శించాలని, వీటిపైన ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాధికారులతో పాటు సంబంధిత పరీక్షా కేంద్రాల యాజమాన్యులకు కూడా ఉందని సూచించారు. ఈ చట్టాన్ని ఎవరైనా అతిక్రమించిన జరిమానాతో పాటు, శిక్ష అర్హులని సూచించారు.


చట్టమా.. చుట్టమా..!



ఏదైనా ఘటన జరిగినప్పుడు చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రభుత్వ పెద్దలు పదేపదే చెబుతుంటారు. అదే సమయంలో ప్రజలకు ఇబ్బందికరమైన చర్యలేమైనా అధికారులు తీసుకుంటే ఇదేంటంటూ ప్రజాసంఘాల నేతలు ప్రశ్నిస్తే తాము చట్టప్రకారం ముందుకెళ్తున్నామని, కోర్టు ఆదేశాల మేరకే చర్యలు తీసుకుంటున్నామని చెబుతుండడం సర్వ సాధారణం. కానీ రెండు జిల్లాల్లో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు ప్రభుత్వ పెద్దలు, అధికారులు చెబుతున్నట్లు చట్టప్రకారమే వ్యవహరిస్తున్నారా, కోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నారా అంటే కాదనే సమాధానం జనం నోటి నుంచి వస్తోంది. సంక్రాంతి సాంప్రదాయం మాటున కోడిపందేలు పండుగ మూడు రోజులు యథేచ్ఛగా సాగాయి. వాటికి అనుసంధానంగా గుండాట, పేకాట వంటి జూదాలకు అడ్డూఅదుపూ లేనేలేదు. మద్యం ఏరులై పారింది. మొత్తంగా చూస్తే వందల కోట్ల రూపాయలు చేతులు మారాయి. మరి ఇవన్నీ కోర్టు ఆదేశాలకు లోబడి సాగాయా, చట్ట ప్రకారమేనా అనేది అధికారులే చెప్పాల్సి ఉంది. పండుగకు ఒకరోజు ముందు వరకూ రెండు జిల్లాల్లోనూ ఉన్నతాధికారుల నుంచి మండల స్థాయి అధికారుల వరకూ అంతా కోడిపందేలకు అనుమతి లేదని, నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఘీంకరించారు. కొన్ని ప్రాంతాల్లో కోడిపందేల బరులను సైతం ధ్వంసం చేశారు. ఇంతవరకూ చాలా బాగుందని జనం సైతం సంతోషం వ్యక్తం చేశారు. ఏమైందో ఏమో గాని గతానికి భిన్నంగా భోగి రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచే జిల్లాలో పెద్దఎత్తున పందేలు సాగడం అందరినీ విస్మయపర్చింది. జిల్లా అధికారుల నుంచి మండలస్థాయి అధికారుల వరకూ ఎవరూ బహిరంగంగా కనిపించిన పరిస్థితి లేదు. పైగా పందేల నిరోధానికి ఏర్పాటు చేసిన కమిటీలు కూడా పత్తాలేకపోవడం గమనార్హం. ఇదంతా చూస్తే పండుగకు ముందు అధికారుల హడావుడీ అంతా కేవలం తాము అన్ని చర్యలూ తీసుకున్నామని కోర్టుకు చెప్పుకునే దానిలో భాగమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అదే సామాన్య ప్రజల విషయంలో అయితే కోర్టు ఆదేశాల పేరుతో దుందుడుగ్గా వ్యవహరించడం అధికారులకే చెల్లిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంలోనే ఆసక్తికరమైన అంశం తెరపైకి వచ్చింది. అధికార పక్షానికి వత్తాసు పలుకుతూ ప్రతిపక్ష నేత అనుచరులు నిర్వహిస్తున్న పందేల బరిని పోలీసులు అడ్డుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పందేలను అడ్డుకుంటే మొత్తంగానైనా, లేదా ఓ ప్రాంతంలోనైనా అడ్డుకోవాల్సి ఉంది. దానికి భిన్నంగా ఒకే గ్రామంలో అధికార పార్టీ అనుచరులు పందేలు నిర్వహిస్తుంటే అటువైపు కన్నెత్తి చూడకుండా ప్రతిపక్ష నేత అనుచరులు ఏర్పాటు చేసిన పోలీసు బలగాలు మోహరించడం దేనికి సంకేతమో జిల్లా అధికారులే చెప్పాలి.

చట్టాలు, కోర్టులు ఇచ్చిన ఆదేశాలను తుంగలోతొక్కడం ఏజెన్సీలోని కొందరు అధికారులకు పరిపాటిగా మారింది. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ప్రత్యేక హక్కులు ఉంటాయనేది అందరికీ తెలిసిందే. ఈ అంశం ఆయా ప్రాంతంలో పనిచేసే రెవెన్యూ అధికారులకు పట్టకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రధానంగా గిరిజనుల సాగులో ఉన్న భూములకు సంబంధించి వివాదాలు తలెత్తినప్పుడు రికార్డుల పరిశీలన చేసి చట్టప్రకారం నిర్ణయాలు తీసుకోవడం గతంలో అధికారులు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కానరావడం లేదు. ఎస్‌డిసి కోర్టు ఇచ్చిన తీర్పును సైతం పక్కనపెట్టి గిరిజనులకు చెందాల్సిన భూముల్లో పంటలకు గిరిజనేతరులకు ప్రొటక్షన్ ఆర్డర్లు ఇవ్వడం చర్చనీయాంశమవుతోంది. కనీసం రికార్డు పరిశీలన చేయకపోవడం విశేషం. ఒకవేళ పొరపాటున ఉత్తర్వులు ఇచ్చిన సందర్భంలో ఇదేంటని ప్రశ్నించిన గిరిజనులు, గిరిజనేతరుల పట్ల కనీస విచక్షణ లేకుండా దుందుడుగ్గా వ్యవహరించడం బుట్టాయగూడెం మండల రెవెన్యూ అధికారులకే చెల్లిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే తరహాలో జీలుగుమిల్లిలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ సాగించిన వ్యవహారాలు అందరికీ తెలిసిందే. దీనిపై ప్రజా ఆందోళనతో ఉన్నతాధికారులు పరిశీలించి సదరు అధికారిపై సస్పెన్షన్ వేటు విధించిన విషయమూ ఏజెన్సీ అధికారులకు తెలియంది కాదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఏజెన్సీలో గిరిజనుల బతుకులు చిన్నాభిన్నం చేయకుండా వారి మనుగడ ప్రశ్నార్థకం చేయకుండా గిరిజన చట్టాల ప్రకారం అధికారులు వ్యవహరించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్



పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కాగుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002-2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక శనివారం అదే పాఠశాలలో నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు పలువురు హాజై పరస్పరం యోగక్షేమాలను తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు ఆనాటి తరగతిలో విశేషాలను ఒకరికొకరు జ్ఞాపకం చేసుకుంటూ సరదాగా ఉల్లాసంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అన్నెపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పశు వైద్య ఆరోగ్య శిబిరాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి



రామకృష్ణ

మండలంలోని ప్రొద్దువాక, పెదగొన్నూరు వెటర్నరీ డిస్పెన్సరీల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 20వ తేదీ సోమవారం నుంచి 31వ తేదీ శుక్రవారం వరకు 12 రోజుల పాటు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ప్రొద్దువాక పశు వైద్య సహాయ శస్త్ర చికిత్సకులు డాక్టర్ ఆరేపల్లి రామకృష్ణ శనివారం తెలిపారు. ఈ పశువైద్య ఆరోగ్య శిబిరాల్లో పశువులకు నట్టల నివారణ మందులు, సూడి పరీక్షలు, తిగపోర్లే గేదెలకు చికిత్స, కృత్రిమ గర్భధారణ, సన్నా జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రోజుకు రెండు గ్రామాలు చొప్పున పశు వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో ఉన్న పాడి రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ నెల 20న బొమ్మినంపాడు, 21న అల్లూరు, 22న కొర్రగుంటపాలెం, 23న పెదగొన్నూరు, 24న విశ్వనాద్రిపాలెం, 25న వడాలి, 26న చినకామనపూడి, 27న చిగురుకోట, 28న ప్రొద్దువాక దేవపూడి, 29న వాడవల్లి, 30న వైవాక, 31న పెయ్యేరు, ఊటుకూరు గ్రామాల్లో పశువైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆరేపల్లి రామకృష్ణ తెలిపారు.

దళితులపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

దళిత యువకులపై దాడి చేసినవారిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం మండలం తిరుమలపురంలో గత నెల 19వ తేదీన అదే గ్రామానికి చెందిన వ్యక్తుల చేతిలో దాడికి గురైన దళిత యువకులను ఆయన శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ దళిత యువకులపై కత్తులతో దాడి చేసి పిడి గుద్దులు గుద్ది కులం పేరుతో దూషించి చంపేస్తామని బెదిరించిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసి వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలన్నారు. తిరుమలాపురంలోని చేపల చెరువు విషయంలో తలెత్తిన వివాదమే గొడవలకు కారణమన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ

ప్రజాశక్తి - చింతలపూడి

హెల్మెట్ ధరించి వాహనం నడపడం వల్ల ప్రమాదం జరిగిన ప్రాణాపాయం ఉండదని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు అన్నారు. చింతలపూడి కోర్టు ప్రాంగణంలో ద్విచక్ర వాహనదారులకు శనివారం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హెల్మెట్ల ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించి వాహనం నడపడం వల్ల ప్రమాదం జరిగిన ప్రాణాపాయం ఉండదన్నారు. సామాజిక సేవా దృక్పథంతో హెల్మెట్ల పంపిణీకి ముందుకొచ్చిన చింతలపూడి పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ మెంబర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ జయరాజు పాల్గొన్నారు.

వీర రాఘవరెడ్డి మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఏలూరు

రైతు నేత, పెంటపాడు గ్రామానికి చెందిన నల్లమిల్లి వీరరాఘవరెడ్డి మృతికి రైతు సంఘం జిల్లా కమిటీ సంతాపం తెలిపినట్లు జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరరాఘవరెడ్డి ముదునూరు సహకార సంఘం అధ్యక్షులుగా, రాష్ట్ర రైతు కార్యచరణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, సర్ కాటన్ రైతు సంఘం అధ్యక్షుడుగా పని చేశారని తెలిపారు. రైతాంగ సమస్యలపై జరిగిన అనేక పోరాటాల్లో వీర రాఘవరెడ్డి ముందుండి పని చేశారని పేర్కొన్నారు. ఆయన మృతి రైతు ఉద్యమానికి తీరని లోటని తెలిపారు. వీర రాఘవ రెడ్డి మృతికి సంతాపం, అయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపినట్లు పేర్కొన్నారు.

ఘనంగా రోడ్డు భద్రత మాసోత్సవాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఈ నెల 16వ తేదీన ప్రారంభమైన రోడ్డు భద్రత మాసోత్సవాలను నూజివీడు ఆర్‌టిసి డిపోలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగమురళి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాసోత్సవాలను వచ్చే నెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోడ్డు మధ్యలో బస్సులను ఆపకుండా పక్కకు తీసి ఆపాలని సూచించారు. బస్సుల మెయింటెనెన్స్ విషయంలో జాగ్రత్తలు వహించాలని వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పవన్‌కుమార్, ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్, మెకానికల్ ఛార్జ్ మెన్, గ్యారేజ్, ఆఫీస్, డ్యూటీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

సర్వసభ్య సమావేశంలో ఎంఎల్ఎ వెంకటరాజు

ద్వారకాతిరుమల : మండలంలో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు సూచించారు. ద్వారకా తిరుమల మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ పివివి.ప్రకాష్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గోపాలపురం ఎంఎల్‌ఎ హాజరయ్యారు. ఎంపిపి బొండాడ మోహిని వెంకన్నబాబు, జెడ్‌పిటిసి సభ్యులు శామ్యూల్ అతిథులుగా పాల్గొన్నారు. ఏఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా మండలాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి పట్ల తాము కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

నేరాలు - ఘోరాలు

బాలిక అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

బాలిక అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... టి.నరసాపురం గ్రామానికి చెందిన సత్యవరపు బాలకృష్ణ పెద్ద కుమార్తె పూజిత వెంకటలక్ష్మి (14) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. పూజిత అదే గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద యూరిన్‌కి బాత్‌రూమ్‌లోకి వెళ్లి పడిపోయింది. దీంతో పూజితను తల్లిదండ్రులు చింతలపూడి విన్ కా హెల్త్ కేర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలిక మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి బాలకృష్ణ ఫిర్యాదు మేరకు ఎఎస్‌ఐ వి.జయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిధిలోని వేలేరు గ్రామంలో నాటుసారా స్థావరంపై కుక్కునూరు పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో పామిలేరు వాగు వద్ద సుమారు 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సిఐ రమేష్‌బాబు తెలిపారు.

డిఎల్‌పిఒకు నడిపల్లి వాసుల నిరసన సెగ

నిధులు దుర్వినియోగంపై గ్రామస్తుల ఫిర్యాదు

గతంలో విచారణ ఏకపక్షంగా చేశారని ఆవేదన

మళ్లీ విచారణకు ఆయన వద్దని డిమాండ్

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలం నడిపల్లి గ్రామ పంచాయతీపై జిల్లా అధికారులకు పిజిఆర్ఎస్‌లో పలువురు చేసిన ఫిర్యాదుపై శనివారం నడిపల్లి గ్రామానికి వెళ్లిన విచారణాధికారికి గ్రామస్తుల నుంచి నిరసన సెగ తగిలింది. నడిపల్లి గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయని పలువురు చేసిన ఫిర్యాదులపై విచారణ చేపట్టడానికి ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి కెపి.చంద్రశేఖర్ శనివారం నడిపల్లి గ్రామ సచివాలయానికి చేరుకున్నారు. ఆయన రాకను తెలుసుకున్న గ్రామస్తులు నడిపల్లిలో విచారణ నిమిత్తం వచ్చిన విచారణాధికారిని గో బ్యాక్, గోబ్యాక్ అంటూ ప్లకార్డులతో, ఫ్లెక్సీలతో నినాదాలు చేశారు. గ్రామ పంచాయతీలో గత ప్రభుత్వ పరిపాలనలో జగనన్న కాలనీలకు తమ్మిలేరు నుంచి ఉచిత ఇసుక పంపిణీ ముసుగులో ఇతర అవసరాలకు తరలిపోయిందని, ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల నుంచి సీనరేజ్ పేరుతో రూ.30 లక్షలు వసూలు చేసి వాటిని పంచాయతీకి జమ చేయలేదని, పంచాయతీలో జరిగిన మరికొన్ని అక్రమాలపై జుజ్జవరపు సురేష్, పెనుమూరి సురేష్, మద్దాల గోపాలరావు పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన అప్పటి డిపిఒ పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అప్పటి డిఎల్‌పిఒ, ప్రస్తుత డిఎల్‌పిఒ కెపి.చంద్రశేఖర్‌ను ఆదేశించారు. అయితే సదరు డిఎల్‌పిఒ చంద్రశేఖర్ గతంలో విచారణ పేరుతో నడిపల్లి వచ్చి ఫిర్యాదుదారులకు సమాచారం ఇవ్వకుండా పంచాయతీ యాజమాన్యంతో నాలుగు గోడల మధ్య విచారణ జరిపి, ఆ విచారణలో ఫిర్యాదుదారుడు జుజ్జవరపు సురేష్ హాజరు కాకపోయినా హాజరైనట్లుగా విచారణ నివేదికలో చేర్చారని గ్రామస్తులు తెలిపారు. సురేష్ లేకుండా ఒక ఫోటో తీసి ఆ ఫోటోలో ఉన్నట్లుగా చూపి అప్పటి విచారణ నివేదికను అధికారులకు అందించినట్లు తెలుసుకున్న ఫిర్యాదుదారులు ఆ నివేదికపై వెంటనే స్పందించి విచారణాధికారి విచారణ సమయంలో వేరే వాళ్లు ఉండగా విచారణ చేస్తున్నట్లు ఒక ఫొటో తీయించుకుని ఆ ఫొటోలో తాను లేక పోయినా ఉన్నట్టుగానే విచారణాదికారి ముందు స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తప్పుడు నివేదిక తయారు చేసిన విచారణాధికారినే జిల్లా అధికారులు మళ్లీ నడిపల్లిలో మరోసారి విచారణ జరపాలని పంపడం హాస్యాస్పదమని ఫిర్యాదుదారులు అన్నారు. మరోసారి నడిపల్లి పంచాయతీకి విచారణకు రావడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ అధికారి విచారణపై తమకు నమ్మకం లేదని, నిష్పాక్షపాతంగా విచారణ జరగాలంటే జాయింట్ కలెక్టర్‌తో, జ్యూడిషియరి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించే విచారణను ఫిర్యాదుదారులు బామ్‌కాట్ చేశారు. విచారణాదికారిగా మరోసారి నడిపల్లి వచ్చిన డిఎల్‌పిఒ కెపి.చంద్రశేఖర్‌కు మీరు జరిపే విచారణపై మాకు నమ్మకం లేదని తెలుపుతూ ఒక వినతి పత్రాన్ని అందించి ఫిర్యాదు దారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఘనంగా 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'

ప్రజాశక్తి - చింతలపూడి

మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ పావని ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్‌లో చింతలపూడి నియోజకవర్గానికి ఉత్తమ ర్యాంకు వచ్చేలా సహకరించాలన్నారు.

దెందులూరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలన్నీ కూడా స్వచ్ఛతకు నిదర్శనంగా నిలిచేలా చేయాలన్నారు. దెందులూరు గ్రామంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

కొయ్యలగూడెం : స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కన్నాపురం పంచాయతీలో నిర్వహించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మానవహారం, ప్రదర్శనలు, ఇతర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

భీమడోలు : పొలసానిపల్లి గ్రామాన్ని వంద రోజుల వ్యవధిలో అత్యంత పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని సర్పంచి గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పంచాయితీ పాలకమండలి ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. దీనిలో భాగంగా గ్రామ సర్పంచి, గ్రామపంచాయతీ కార్యదర్శి రోడ్లను శుభ్రం చేశారు. మురుగు కాలువలను బాగు చేశారు. గ్రామస్తులతో కలిసి పారిశుధ్య పరిరక్షణకు శ్రమదానం చేశారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ వినియోగం నిరోధంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడంతో పాటు పుర వీధుల్లో ర్యాలీని నిర్వహించారు.

జీలుగుమిల్లి : మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ముఖ్య లక్ష్యమని ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్ర పరిచారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు.

ఆగిరిపల్లి : స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా ప్రతిక్కరూ పరిసరాల పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహించాలని ఆగిరిపల్లి తహాశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ అన్నారు. నెలలో మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆగిరిపల్లిలో శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు.

కలిదిండి : స్థానిక బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మానవహారం నిర్వహించారు. స్వచ్ఛ దివస్‌పై నాయకులు, అధికారులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

ముదినేపల్లి : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పెదపాలపర్రులో నిర్వహించిన కార్యక్రమంలో కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

పోలవరం : మండలంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం సర్పంచి పొడుం పుష్ప ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపిపి సంఘం జిల్లా అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, కూటమి నాయకులు, జనసేన పార్టీ మండల కార్యదర్శి గుణపర్తి చిన్ని, కరిబండి నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై ఇరువైపులా శుభ్ర పరచి, మొక్కలు నాటి, స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు.

ముసునూరు : మండలంలోని నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రాణి, తహాశీల్దార్ కె.రాజకుమార్ మాట్లాడారు. పరిశుభ్రత పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామస్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

బుట్టాయగూడెం : మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ కె.జ్యోతి, తహశీల్దార్ చలపతిరావు ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీని ఎంఎల్‌ఎ బాలరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తెల్లం వెంకాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదనానికి ప్రతిరూపం ఎన్‌టిఆర్

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

పలు చోట్ల వర్ధంతి కార్యక్రమాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

తెలుగుదనానికి ప్రతిరూపం ఎన్‌టిఆర్ అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి పార్థసారధి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి రక్తదానంలో పాల్గొన్న టిడిపి కార్యకర్తలు, నాయకులను అభినందించారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమలలో టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ సిఎం కీర్తిశేషులు నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమం వైష్ణవి కళ్యాణ మండపం వద్ద ఘనంగా నిర్వహించారు. మండలంలోని తిమ్మాపురం, రాళ్లకుంట, రాజుపాలెం, తిరుమలెంపాలెం పలు గ్రామాల్లో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

చింతలపూడి : తెలుగుజాతి కీర్తి ప్రతిష్టలను దేశవ్యాప్తంగా విస్తరించిన మహనీయుడు కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు అని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ప్రగడవరంలో ఎన్‌టి.రామారావు వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రెయిన్‌బో అధినేత శ్రీనివాస్‌రెడ్డి తలపెట్టిన నా ఊరు నా సాయంను అందించారు. అదేవిధంగా ఇటీవల మరణించిన కార్యకర్తల పిల్లల చదువుల నిమిత్తం తాళ్లూరి చంద్రశేఖర్, రాజా కలిసి ఆర్థిక సాయం అందించారు.

భీమడోలు : భీమడోలులోని టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ వర్ధంతిని పురస్కరించుకుని గన్ని ఆంజనేయులు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అంతకుముందు గన్ని వీరాంజనేయులు కూటమి పార్టీలకు చెందిన ఇతర నాయకులతో కలిసి మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదాన శిబిరం వద్ద ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 81 మంది యువత రక్తదానం చేశారు. రక్తదాతలను గన్ని వీరాంజనేయులు అభినందించారు.

ఏలూరు సిటీ : అమీనాపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎంఎల్‌ఎ ప్రారంభించగా దాదాపు 50 మంది నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడారు. అనంతరం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పద్మశ్రీ ప్రసాద్, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి పూలమాల వేసి నివాళుర్పించారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం పట్టణంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో టిడిపి చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు, పోలవరం ఎఎంసి మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం దిప్పకాయలపాడులో మాన వత సంస్థ, ఎన్‌టిఆర్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాతలకు ఎన్‌టిఆర్ ట్రస్ట్ వారు సర్టిఫికెట్లు అందించారు.

వేలేరుపాడు రూరల్ : మండలంలోని స్థానిక టిడిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షులు అమరవరపు అశోక్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు శాఖమూరి సంజీవులు మాట్లాడారు.

టి.నరసాపురం : తెడ్లం, తిరుమలదేవిపేట, వీరభద్రవరం, బందంచర్ల, బొర్రంపాలెం, వందరామన్నపాలెం, మక్కినవారిగూడెం తదితర గ్రామాల్లో టిడిపి నేతలు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బొర్రం పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

జీలుగుమిల్లి : జీలుగుమిల్లిలో టిడిపి మండలాధ్యక్షులు ఎస్.సాయి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పి.అంకంపాలెంలో ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీను ఆధ్వర్యంలో, దర్భగూడెంలో తెలుగు యువత ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

కలిదిండి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. మట్టగుంటలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం వృద్ధులకు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

ఆగిరిపల్లి : టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టి.రామారావు 29వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆగిరిపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎ.శ్రీనివాసరావు, ఎం.గోపాలకృష్ణ, పి.నరసింహారావు, ఎం.సత్యకుమార్, ఎస్‌కె.చాన్‌భాషా, డి.సీతయ్య, జి.రాజు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : మండలంలోని కండ్రికగూడెంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి రాష్ట్ర ట్రైకర్ ఛైర్మన్, టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బుట్టాయగూడెం కొమ్ముగూడెం సెంటర్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

కుక్కునూరు : కుక్కునూరు రామాలయం వద్ద తెలుగుదేశం దిమ్మ వద్ద ఎన్‌టిఆర్ త్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిఎ సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ మాట్లాడారు. పార్టీ మండలాధ్యక్షులు ముల్లిశెట్టి నాగు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

పోలవరం : పోలవరం, పట్టిసీమ, గూటాల, ప్రగడపల్లి, కొత్త పట్టిసీమ, ఎల్ఎన్‌డి పేటతో పాటు పలు గ్రామాల్లో టిడిపి నాయకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ముదినేపల్లి : చిగురుకోటలో పార్టీ గ్రామ అధ్యక్షుడు తుమ్మా వీరాంజనేయులు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ కో కన్వీనర్ కొడాలి వినోద్ పాల్గొన్నారు. అల్లూరులో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ముసునూరు : మహా ఘనుడు ఎన్‌టిఆర్ అని టిడిపి మండలాధ్యక్షులు దేవినేని డలరామ్ అన్నారు. మండలంలోని 16 గ్రామాల్లో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి నుంచి రైల్వే గేటు మూసివేత

భీమడోలు: భీమడోలు - పూళ్ల రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న 361 నెంబరు భీమడోలు రైల్వే గేట్‌ను ట్రాక్ అత్యవసరం మరమ్మతుల కారణంగా ఈ నెల 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఏలూరుకు చెందిన సీనియర్ సెక్షన్ ఇంజినీర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వాహనదారులు, పాదచారులు, పశువుల పెంపకందారులు ఆ సమయంలో తమ అవసరాల కోసం ప్రత్నామాయ ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు.